

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి మే 13న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. ఆదివారం కలెక్టరేట్ ఎఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా 60 సంవత్సరాలు దాటిన ఉపధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రాలలో మెరుగైన వసతులు కల్పించాలని, జిల్లా అంతటా ఒకే విధమైన రెమ్యునరేషన్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాష, శ్రీనివాసరడ్డి, రాష్ట్ర కౌన్సిరల్ గురయ్య, జిల్లా కార్యదర్శులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, రామసుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు నరసింహులు, మస్తాన్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బిజెపి భావోద్వేగ రాజకీయాలను తిప్పికొట్టాలి

- ఇండియా కూటమి సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - కడప



ఐక్యత చాటుతున్న ఇండియా కూటమి సభ్యులు

భారత రాజ్యాంగ పీఠికలోని ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, స్వావంబలన, సామాజిక న్యాయం, సోషలిజం లక్ష్యాలను విస్మరించి దేశాన్ని విభజించి పాలించడం, భావోద్వేగ రాజకీయాలను నడుపుతోందని, వీటిని తిప్పికొట్టాలని వక్తలు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం ప్రాబల్యం కల్గిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఇండియ కూటమి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పదేళ్ల పాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నిటినీ ప్రయివేట్ పరం చేసిందన్నారు. నేడు విపక్షాలను అనిచేందుకు రాజ్యాంగ వ్యవ స్థలను వాడుకునే బిజెపి చెంచా యుగంపై పోరాటం ఉమ్మడిగా చేయాల్సిన చారిత్రిక పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో టిడిపి, బిజెపితో బహిరంగ పొత్తు, వైసిపి రహస్య పొత్తు, రాష్ట్ర అభివృద్ధికి ప్రమాదంగా పరిణమించిందని పేర్కొన్నారు. కడప జిల్లా అభివృద్ధి పట్టించుకోని పాలక, ప్రతిపక్ష పార్టీలు జిల్లా ప్రజల కళ్ళకు గంతలు కట్టి ఓట్లు అడుగుతున్న వైనం నేడు చూస్తున్నామని వారు ఎద్దేవా చేశారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఊసే లేదని, జిల్లాలో పారిశ్రామిక వాడ మూతలు పడి విలవిలలాడుతోందని, కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్ ఎదుగు పొదుగు లేకుండా ఉందని, చెన్నూరు షుగర్ ఫ్యాక్టరీ మూలన పడ పోయిందని వాపోయారు. ప్రొద్దుటూరు, పోరు మామిళ్ల పాల ఫ్యాక్టరీలు కనుమరుగైపోయాయని పేర్కొన్నారు. మైదుకూరు దానా పరిశ్రమ, వనిపెంట ఇత్తడి పరిశ్రమ నిర్వీర్యం అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందుల యురేనియం ప్రాజెక్టు అక్కడి నీటిని, గాలిని విష తుల్యం చేశాయని పేర్కొన్నారు. పాడా అవినీతితో కూరుకుపోయిందని, కడప కలెక్టర్ సంతకాలు జిల్లాలో అధికార పార్టీ పెద్దలు చేసి ఎన్ఒసిలులు సృష్టిస్తున్నారని పత్రికల్లో వార్తలు చూస్తున్నామని తెలిపారు. ప్రయివేట్ ల్యాండ్స్ సైతం భూకబ్జాలకు గురవుతూ ఉంటే పీడీయాక్ట్ పెట్టలేని నిస్సహాయ పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు ఉన్నారని, ఇవి చాలవంటూ ల్యాండ్ టైటిల్ చట్టం తెచ్చి పేదల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములు చట్టబద్ధంగా లాక్కొవడానికి చూస్తున్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్ల పేరిట వ్యవసాయాన్ని పాలకులే సంక్షోభంలోకి నెట్టుతు న్నారని వారు విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు జీర్ అహ్మద్, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి.చంద్ర, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్.తిరుపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ సత్తార్, విష్ణు ప్రీతమ్ రెడ్డి, చీకటి చార్లెస్, సుజాతరెడ్డి , చిన్న కుల్లాయప్ప, శ్యామలాదేవి, అలీ ఖాన్, సలావుద్దీన్, న్యాయవాది సుధాకర్, నాగరత్న, గౌరీ, సిపిఎం నాయకులు ఏ.రామ్మోహన్, బి.మనోహర్, సిపిఐ నాయకులు వెంకటశివ, బాదుల్లా, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రబీలో గణనీయంగా తగ్గిన వేరుశనగ దిగుబడి

- కొనుగోలుకు ముందుకు రాని ప్రభుత్వం
-నాణ్యత, పరిమాణం పేరుతో ప్రయివేట్ వ్యాపారుల ఇష్టారాజ్యం



వేరుశనగ కాయలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ ఏడాది రబీ సీజన్‌లో బోరు బావుల కింద సాగు చేసిన వేరు శనగ దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందో ళన చెందుతున్నారు. గత ఏడాది నవంబర్‌లో రైతులు అధిక దిగుబనిచ్చే 1812, కదిరి లేపాక్షి, 1694, ట్యాగ్, గిరినార్-4 రకాల విత్తనాలను సాగు చేశారు. ఈ విత్తనాలకు సంబంధించి దాదాపు నాలుగు నెలల 20 రోజుల అనంతరం పంట దిగుబడి చేతికొచ్చే అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది పంట సాగు చేసినప్పటి నుంచి వర్షం కురువకపోవడంతో పంట దిగుబడి తగ్గిందని రైతులు చెబు తున్నారు. మండల వ్యాప్తంగా 1,320 ఎకరాలలో ఏడాది పంటను సాగు చేశారు. ఎకరాకు రూ30 నుంచి రూ.40 వేలు పెట్టుబడులు అయ్యాయని రైతు లు చెబుతున్నారు. ఎకరాకు కేవలం 10 నుంచి 15 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రబీ సీజన్‌లో సాగు చేసే వేరుశనగకు ఆధునిక వంగడాలైన ఈ రకాలు విత్తనం వేస్తే ఎకరాకు 40 నుంచి 50 బస్తాలు దిగుబడి రావాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

కొనుగోలుకు ముందుకు రాని ప్రభుత్వం..

గతంలో రబీ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ పంట ఉత్పత్తులను ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు కోసం కొనుగోలు చేసేది. అయితే ఈ ఏడాది ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో దళారులు ఆడింది ఆట.. పాడింది పాటగా ఉంది. ధరలను అమాంతంగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. 43 కిలోల బస్తా నాణ్యత, పరిమాణం ఆధారంగా రూ.2000 నుంచి రూ.2600 వరకు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ధర వేరుశెనగకు రూ.6,350 ఉంది. అయితే నాణ్యత, పరిమాణం పేరుతో వ్యాపారస్తులు ధరలను అమాంతంగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వ మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేరుశనగ సాగు గిట్టుబాటు కావడం లేదు..

ప్రస్తుతం వేరుశనగ సాగు గిట్టుబాటు కావడం లేదు. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీల ఖర్చు భారీగా పెరిగాయి. ఎకరాకు రూ.40 వేలు వరకు పెట్టుబడి వచ్చింది. ఈ కారణంగా ఎకరాకు 10 నుంచి 15 బస్తాలు దిగుబడులు వస్తే నష్టం వస్తోంది. కావున ప్రభుత్వం స్పందించి సాగు చేసిన రైతులకు పరిహారం అందించాలి.

- చంద్రమౌళి, రైతు, సుంకేసుల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

ఈ ఏడాది రబి సీజన్‌లో సాగు చేసిన పంటల దిగుబడి వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. వేరుశెనగ దిగుబడులు తగ్గినట్లు మా దృష్టికి వచ్చింది. దిగుబడి పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు వివరిస్తా.

- శివమోహన్ రెడ్డి, ఎఒ, సింహాద్రిపురం



మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జెడి, డిఇఒ

'పది' మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి

- పరిశీలకులు వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

పదవతరగతి స్పాట్ వాల్యూషన్‌కు కట్టుదిట్టమైన ఏర్పాటు పూర్తి చేసినట్లు పరిశీలకులు మార్తాల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నగరపాలక ఉన్న పాఠశాల మెయిన్‌లో నిర్వహించే స్పాట్ వాల్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి జిల్లాలో స్పాట్ వాల్యూషన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఎలాంటి సంఘటనలకు తావు ఇవ్వకుండా పని చేయాలని చెప్పారు. కేటాయించిన సబ్జెక్టులో విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఒ అనురాధ పాల్గొన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక సందడి

ప్రజాశక్తి - కడప అర్బన్

శిల్పారామం శిల్పకళావేదికపై ఆదివారం విద్యార్థుల సాంస్కృతిక సందడి ప్రేక్షకులను అలరించాయి. జిఆర్‌కె.జివికె స్కూల్ విద్యార్థులు సినీ,జానపద గీతాలకు నృత్యాలు చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఎఒ శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

గర్భిణికి రక్తదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

రిమ్స్‌లో రవణమ్మ అనే గర్భిణికి ఆపరేషన్‌కు అవసరమైన రక్తం కోసం జెబివిఎస్ ది ప్రిజర్వేర్ సేవ సమితి వ్యవస్థాపకులు అశోక్‌ను సంప్రదించారు. ఆయన మహిళకు అవసరమైన రక్తాన్ని అందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ వాలంటీర్లు నాగార్జున, పద్మావతి, కార్తీక్, సల్మాన్, ఆయేషా పాల్గొన్నారు.

నగరంలో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని టూ టౌన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలు పోలీసు కవాతు నిర్వహించారు. ఎస్పి ఆదేశాల మేరకు డిఎస్‌పి ఆధ్వర్యంలో నకాష్, అగాడి, సాయిపేట, వక్కలపేట, అల్మాస్‌పేటలోని ప్రధాన రహదారుల్లో ఫ్లాగ్ మార్చ్ కొనసాగించారు. డిఎస్‌పి షరీఫ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా ప్రజల్లో ఓటు వినియోగంపై భరోసా ఇచ్చేందుకు సాయుధ బలగాల కవాతు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో టూటౌన్ సిఐ ఇబ్రహీం, చిన్నచౌకు సిఐ నరసింహారెడ్డి, తాలూకా సిఐ తిమ్మయ్య, ఎస్‌లు రంగస్వామి, మధుసూధన్‌రెడ్డి, రవికుమార్, సంజీవ రాయుడు, మహమ్మద్ రఫీ, ఎం.ఎ.ఖాన్, చంద్రమోహన్, తిరపాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



నగరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు



పట్టుబడిన వెండి, నగదును తరలిస్తున్న పోలీసులు

931కిలోల వెండి, రూ. 21 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎన్నికల వేళ అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఆదివారం భారీగా వెండి, నగదు పట్టుబడింది. ఓ ఇంట్లో నిలువ ఉంచిన 931 కిలో వెండి, రూ.21లక్షలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అవి తమిళనాడుకు చెందిన వ్యాపారులు సంపత్, కన్నాకు చెందిన సొత్తుగా గుర్తించారు. పట్టుబడిన వెండి, నగదును జిఎస్‌టి, ఐటి శాఖ అధికారులకు అప్పగించారు.

అధికారంలోకొస్తే 9 గ్యారంటీ పథకాలు అమలు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె



ఎన్.తులసిరెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 9 గ్యారంటీ పథకాలను అమలు చేయనున్నట్లు పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటకలో 5 గ్యారెంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా.. తెలంగాణలో 6 గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిందన్నారు. అలాగే ఎపిలో 9 గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని తెలిపారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద ప్రతి పేద కుటుంబంలో ఒక మహిళకు ఏడాదికి రూ.లక్ష ఆర్థికసాయం అందుతుందన్నారు. రైతులకు రూ.రెండు లక్షల వరకు వ్యవసాయ రుణాల మాఫీ చేస్తామన్నారు. రైతు పెట్టుబడి మీద 50 శాతం లాభంతో కనీస మద్దతు ధర కల్పిస్తామన్నారు. పదేళ్లపాటు ప్రత్యేకహోదా అమలు చేస్తామని తెలిపారు. ఇల్లు లేనివారికి రు.5 లక్షలతో ఇల్లు నిర్మాణం చేపడతామన్నారు. ప్రతి ఒక్కరికి కెజి నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని తెలిపారు. వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.4 వేలు, విభిన్నప్రతిభావంతులకు నెలకు రూ.6 వేలు పెన్షన్ అందిస్తామని వివరించారు. ఉపాధి హామీ పథకం కింద కనీస కూలి రోజుకు రూ.400 వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2 లక్షల 25 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తులసిరెడ్డి ప్రజలను కోరారు.

'పది' స్పాట్‌కు మినహాయింపు లేదు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదవతరగతి మూల్యాంకనానికి ఉపాధ్యాయులకు మినహాయింపు లేదని డిఇఒ అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్డర్స్ ఇచ్చిన ప్రతి ఉపాధ్యాయుడూ తప్పక మూల్యాంకనానికి రావాలని తెలిపారు. ఎవరికి మినహాయింపు లేదని పేర్కొన్నారు. తప్పక హాజరై మూల్యాంక కేంద్రంలో రిపోర్టు చేయాలని తెలిపారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

అనుమతి లేని పాలిటెక్నిక్, ఎపిఆర్‌జెసి కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రయివేట్ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో అనుమతి లేకున్నా పాలిటెక్నిక్, ఎపిఆర్‌జెసి కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర, అయ్యన్న, హరికృష్ణారెడ్డి, నందకిశోర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మన్సూరు అక్బర్

1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలి

- టిడిపి అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్

ప్రజాశక్తి - కడప అర్బన్

యుద్ధ ప్రాతిపదికన గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగులతో 1వ తేదీ పెన్షన్‌లు పంపిణీ చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ డబ్బులు తన సొంత కాంట్రాక్టులకు ఇవ్వడం వల్ల ఖాజానాలో సరిపడ నిధులు కొరత ఏర్పడిందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వాలంటీర్లను ఎన్నికల ప్రచారంలో తిరగవద్దు అని చెప్పినప్పటికీ వైసిపి వారిని పార్టీ కార్యక్రమంలో వాడుకోవడం వల్ల వందల మంది పైన సస్పెండ్లు, క్రిమినల్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. దీనికి కారణం జగన్ సర్కార్ అని అన్నారు. జగన్ సర్కార్ అసమర్థ పాలనతో రాష్ట్రంలో అభివద్ధి నిలిచిపోయిందన్నారు. అన్ని రాష్ట్రాలు జట్ స్పీడ్‌తో దూసుకుపోతుంటే మన రాష్ట్రం వెనుక బడిపోయిందని చెప్పారు. మహిళలు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణమే కాదు, జీవన ప్రయాణం లోను భద్రంగా, క్షేమంగా, సాధికారత వైపు శర వేగంగా నడిపించగలరని తెలిపారు. సమావేశంలో జిల్లా మైనారిటీ నాయకులు మంజూరు అహమ్మద్, సుభాన్, ఖాదర్ సాహెబ్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సంఘం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్‌జిఒ గృహ నిర్మాణ సంఘం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, సంఘం అధ్యక్షులు ఎల్.కొండారెడ్డి అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో మహాజన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, సి.హెచ్.పురుషోత్తమ నాయుడు సహకారంతో నూతన భవనాల సముదాయం, అందరికి ఇంటి స్థలాలు మంజూరు చేయిస్తామని తెలిపారు. సమావేశంలో ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, సొసైటీ డైరెక్టర్లు కె.ఎస్.వి.ప్రసాద్, వెంకటరెడ్డి, నర్సింహా, లక్ష్మీ నారాయణ, రమేష్‌కుమార్, రాఘవరెడ్డి, పి.శ్రీనివాసులు, నాయకులు, సిటీ, తాలూకా నాయకులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఆర్‌టిసి నాయకులు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు

శాంతి సమాజ నిర్మాణమే 'మానవత'లక్ష్యం

ప్రజాశక్తి-చెన్నూరు

శాంతి సమాజ నిర్మాణమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముఖ్య ఉద్దేశమని, ఆ దిశగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పనిచేస్తున్నారని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షులు జి .ఎన్ భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన ఉండేలా చంద్రఓబుల రెడ్డి కుమారుడు ఉండేలా ఓబుల్ రెడ్డి ఐఐటి జెఇఇ మెయిన్స్ ఆల్ ఇండియా 47వ ర్యాంక్ సాధించిన సందర్భంగా ఓబుల్ రెడ్డి తల్లిదండ్రులైన చంద్రబాబు రెడ్డి దంపతులను సంస్థ సభ్యులు రూ. 30 వేల నగదు ప్రోత్సాహంతో ఘనంగా సత్కరించారు. మానవతా స్వచ్ఛంద సేవ సంస్థకు శాంతి రథం, బాడీప్రిజర్స్, వాహనాలు వితరణ చేసిన వారిని వారు ఘనంగా సన్మానించారు. 20 సంవత్సరాలుగా అనాధ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆటో బాబును వారు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతి ఏటా బాగా చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు ఇచ్చేందుకు కృషి చేస్తుందని తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవ సంస్థకు ప్రతి ఒక్కరు అండగా నిలిచి సంస్థను మరింత ముందుకు తీసుకుపోయేలా పోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ శాశ్వత అధ్యక్షులు పెద పల్లె జయభారత్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, ఆవులబసిరెడ్డి, కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబుతోనే సాధ్యం

కడప అర్బన్ : స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం వెనుకపడిందని తెలిపారు. అనుభవం, బాధ్యత ఉన్న నేతగా మన కోసం చంద్రబాబు నాయుడు చేసే పోరాటంలో ప్రజలందరూ అండగా నిలవాలని పేర్కొన్నారు. యువత భవిష్యత్తుకు బాబు హామీ ఇస్తున్నారని తెలిపారు. మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తారని తెలిపారు.

వైసిపిలో 200 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - కడప



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సిఎం

నగరంలోని 2వ డివిజన్ చలమారెడ్డి పల్లెలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి, ఉప ముఖ్య మంత్రి అంజాద్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం మాజీ కార్పొరేటర్ టిడిపి నాయకులు బాలకొండయ్య ఆర్‌కె నగర్ యాదవ్‌తో పాటు 200 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కే. సురేష్ బాబు, ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. త్వరలో జరగబోవు ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, డిప్యూటీ మేయర్ లు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జిలు, జిల్లా, నగర అనుబంధ విభాగ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భూ తగాదాలో ఇద్దరు రైతుల ఘర్షణ

- ఒకరికి కొడవలి పోట్లు.. పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లి

మండలంలోని పాలెంకొండలో రెవెన్యూ మోసాలకు సామాన్య రైతుల మధ్య భూ విభేదాలు తలెత్తాయి. ఇద్దరి గొడవ తారాస్థాయికి చేరడంతో ఓ రైతును మరో రైతు కొడవలితో అందరికీ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుని వివరాల ప్రకారం.. పాలెం కొండకు చెందిన రైతు బి. నాగరాజుకు వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి ఊరికి సమీపంలో ఉంది. పక్కనే నాలుగు లైన్ల జాతీయ రహదారి వెళుతూ ఉండడంతో భూములకు అమాంతంగా రేట్లు పెరిగాయి. ఆ భూమిపై కన్నేసిన చిన్నప్ప, మురళి, చిన్నక్కలు నాగరాజు పొలాన్ని ఆక్రమించుకోవడానికి కుట్రపన్నారు. రెవెన్యూ అధికారుల సాయంతో గుట్టుగా భూమిని తమపేరుపై ఆన్‌లైన్‌లో మార్చుకున్నారు. అంతటితో ఆగకుండా వారు ఆదివారం భూమిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండడంతో నాగరాజు అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య గొడవ జరగడంతో నాగరాజుపై చిన్నప్ప మురళి కొడవళ్లతో దాడి చేశారు. ఈ సంఘటనలో బాధితుడి తల, చేతి వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ బాధిత రైతును కుటుంబీకులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమించడంతో తిరుపతికి రిఫర్ చేశారు.. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్గాను సందర్శించిన 'పొట్టేలు' యూనిట్ సభ్యులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అమీన్ పీర్ దర్గాను పొట్టేలు మూవీ టీం సభ్యులు సందర్శించారు. ఆదివారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సినిమా ప్రయోషన్స్‌లో భాగంగా హీరో యువచంద్ర కృష్ణ, ప్రొడ్యూసర్ సురేష్‌కుమార్, మూవీ టీం సభ్యులు దర్గాను సందర్శించిన వారిలో ఉన్నారు.

యువత రక్తదాత కావాలి

ప్రజాశక్తి - కడప

ప్రతి యువత రక్తదాతగా మారాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ పరుఖ్ అన్నారు. ఆదివారం రక్తదాన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో రక్త కొరత లేకుండా రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని అన్నారు. రక్తదానంపై ప్రచారం చేస్తూ సేవలందిస్తున్న రాయల్ కరీముల్లాను ఈ సందర్భంగా అభినందించారు. రక్తదానంపై ప్రచారం నిరంతరం చేపట్టాలని ఆయన కోరారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహారీ
సోమవారం (సా)	మంగళవారం (ఉ)
6.31	4.55

నవోదయకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక టీచర్స్ కాలనీలో గౌతమ్ పాఠశాలకు చెందిన విద్యార్థి పగిడేల షణ్ముఖ కల్యాణ్‌రెడ్డి నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే విభాగంలో సీటు సాధించారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థి నవోదయకు అర్హత సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.


పి.షణ్ముఖ కల్యాణ్‌రెడ్డి

సమయానికి పింఛన్లు పంపిణీ చేయాలి

చాపాడు : సమయానికి పింఛన్లు పంపిణీ చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పి.మనోహర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా 1న వచ్చే పింఛన్లకు డబ్బులు లేవన్నారు. తెలుగుదేశం పార్టీ ఎలక్షన్ కమిషనర్లకు వాలంటీర్ల మీద ఫిర్యాదు చేయడం వల్లనే పంపిణీ చేయలేక పోతున్నామని ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎలక్షన్ నోటిఫికేషన్ రాకముందే పార్టీ అధికారంలోకి రాదని తెలిసి ప్రభుత్వం వద్ద ఉన్న వేల కోట్ల డబ్బు అంతా సొంత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి ఖజానా ఖాళీ చేశారన్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చినప్పటి వాలంటీర్లను పక్కన పెట్టిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండి పింఛన్ పంచాలనే ఉద్దేశం ఉంటే సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకొని యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

టిప్పర్ డ్రైవర్‌పై బాబు వ్యాఖ్యలు శోచనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

శింగనమల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును చులకనగా చేస్తూ టిడిపి అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు శోచనీయమని వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ కన్వీనర్ ముత్యాల ఆంజనేయులు ఖండించారు. ఆదివారం వేంపల్లెలోని వైఎస్ఆర్ సూమో స్టాండ్ వద్ద డ్రైవర్లు అందరూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లు ఎమ్మెల్యేలుగా పనికిరారా అని చంద్రబాబును ప్రశ్నించారు. టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులు ఎంఎ, బిఇడి చదివారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సూమో స్టాండ్ అధ్యక్షుడు నాగేంద్ర బాబు, ఉపాధ్యక్షుడు గాలిపోలిరెడ్డి, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవ, వెంకట సుబ్బయ్య, అల్లు, చంద్ర, మౌలాలి, దర్బార్, గౌస్, రఫీ, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ముద్దనూరు : ఈస్టర్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులు ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని చర్చిల్లో, స్థానిక సిఎస్ఐ, సిఎస్ఐ(ఎస్సీఐ), ఆర్‌సిఎం, మన్నా, హెబ్రోన్, హోసన్నా ప్రార్థనా మందిరాల్లో ఆయా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిఎస్ఐ, సిఎస్ఐ(ఎస్సీఐ), ఆర్‌సిఎం చర్చిల్లో రెవరెండ్ పాస్టర్లు దేవసహాయం, సంతోష్ ప్రసన్న రావ్, మద్దెల్ల ఈస్టర్ పర్వదినం ప్రాముఖ్యతను క్రైస్తవులకు వివరించారు. అనంతరం ఏఎల్ఎమ్, ఎస్సెల్ కాంపౌండ్‌లోని పిల్లలు, యువకులు, మహిళలు, పురుషులు, వృద్ధులు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. సాయంత్రం వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాఘవరెడ్డిని పరామర్శించిన రెడ్యం

ఖాజీపేట : అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు, మండల వైసిపి నాయకులు పి.వి.రాఘవరెడ్డిని ఆదివారం వైసిపి నాయకులు, ఎపిఎస్ ఆర్‌టిసి మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పరామర్శించారు. రాఘవరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో చేతికి తీవ్ర గాయమైంది. ఆయన హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మండల వైసిపి కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, రెడ్యం రాఘవరెడ్డి ఇంటికెళ్లి పరామర్శించారు. ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

చిత్రలేఖనం మానసిక వికాసానికి తోడ్పడుతుంది

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యోగివేమన విశ్వవిద్యాలయం చిత్రలేఖన విభాగాధిపతి మృత్యుంజయరావు మాట్లాడుతూ చిత్రలేఖనం పిల్లల మానసిక వికాసానికి తోడ్పడుతుందన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న మృత్యుంజయరావు

మన మనసులో కలిగే వివిధ భావాలకు ఆకారం ఇవ్వడమే చిత్రలేఖనమన్నారు. లలితకళల్లో చిత్రలేఖనానికి ప్రముఖ స్థానం ఉందన్నారు. చిత్రలేఖనం అంటే కేవలం రంగులు అద్దడం కాదని, చిత్రం మనసుతో ఎన్నో అంశాలను సృష్టించడమన్నారు. అపురూపమైన చిత్రాలకు ప్రతిరూపమే మనలోని భావాలకు ప్రతిరూపాలని తెలుస్తున్నామన్నారు. పోటీలో పాల్గొన్న విద్యార్థి చిత్రకారులకు విభాగాల వారీగా బహుమతులు అందజేశారు. ఇందులో సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతిగా రూ.7వేలు నగదును ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 7వతరగతి విద్యార్థిని జెస్సికాకు, రెండవ బహుమతి రూ.5వేలు 9వ తరగతి వెంకటకిషోర్‌కు, మూడవ బహుమతి రూ.3వేలు శ్రీ చైతన్య స్కూల్ 7వ తరగతి నిత్యశ్రీకి అందజేశారు. జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి రూ.5వేలు 6వ తరగతి విద్యార్థి ఇబ్రహింబేగ్, రెండవ బహుమతి రూ.3వేలు 5వ తరగతి మనీషా, మూడవ బహుమతి రూ.1,500 6వ తరగతి పార్థ నిత్యశ్రీకి అందజేశారు. సబ్ జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి రూ.3వేలు 3వతరగతి తన్మశ్రీకి, రెండవ బహుమతి రూ.2వేలు 1వ తరగతి ఆశ్రితకు, మూడవ బహుమతి రూ.1,500 గోపికృష్ణ స్కూల్ 3వ తరగతి చెందిన వి.తన్మశ్రీకి అందజేశారు. కార్యక్రమంలో సిబిఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ బి.రవీంద్రకుమార్, ఐడిపిఎస్ పాఠశాల చిత్రలేఖన అధ్యాపకులు ఫణీంద్ర, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్


సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నాటుసారా బట్టీలు ధ్వంసం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొబ్బుడు పల్లె గ్రామ శివారులో ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది దాడి చేసి 1,200 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. ఒకరిని అదుపులోనికి తీసుకున్నారు. నాటుసారా తయారీ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. దాడిలో కానిస్టేబుల్ నరసింహ, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ వెంకటశివ, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు

9 మంది జూదరులు అరెస్టు

వల్లూరు : దిగువపల్లి ముళ్లపొదల్లో ఆదివారం ఉదయం జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ వెంకటరమణ తన సిబ్బందితో దాడి చేశారు. దాడిలో 9 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,01,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరుపయోగంగా పాల సేకరణ భవనాలు

ప్రజాశక్తి - చాపాడు


సిద్ధారెడ్డిపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న పాల సేకరణ కేంద్రం

మండల పరిధిలోని పలు గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. శిథిలావస్థకు చేరుకున్నాయి. 34 ఏళ్ల క్రితం సిద్ధారెడ్డిపల్లి, నాగులపల్లి, విశ్వనాథపురం, ఓబుల్‌రెడ్డి పేట, చిన్నగురువలూరు, అనంతపురం, అన్నవరం గ్రామాల్లో సహకార సంఘాలు ఏర్పాటు చేసి దాతల నుండి స్థలాలను సేకరించి పాలసేకరణ కేంద్రాలను నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన పాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రొద్దుటూరు, మైదుకూరు తరలించేవారు. కాలక్రమేణా ప్రభుత్వ కేంద్రాలు మూతపడడం, ప్రయివేట్ పాల కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ పాలసేకరణ కేంద్రాలు మరుగున పడ్డాయి. భవనాలు చాలా వరకు దెబ్బతిన్నాయి. సిద్ధారెడ్డిపల్లి గ్రామంలో అయిదేళ్ల క్రితం పాలసేకరణ భవనానికి మరమ్మతులు చేపట్టి మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. అది రెండేళ్లు కొనసాగి, మూతపడింది. ఓబుల్‌రెడ్డి పేటలో భవనం ఇప్పటికీ ప్రయివేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఉంది. పాల సేకరణ కేంద్రాలు మిగిలిన గ్రామాల్లో మాత్రం చాలా అధ్వానంగా మరుగున పడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాల కోసం వీటికి మరమ్మతులు చేసి వినియోగించుకునే అవకాశం ఉంది. విశ్వనాథపురంలో రోడ్డు విస్తరణలో కొంతభాగం భవనాన్ని తొలగించారు. పూర్తిగా దెబ్బతిన్న భవనాలను తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం అముల్ పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటిజం పిల్లల పట్ల జాగ్రత్తలు అవసరం

రేపు అంతర్జాతీయ ఆటిజం అవేర్‌నెస్ డే సందర్భంగా..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వయసుకు తగ్గట్టు పిల్లల్లో రావాల్సిన మానసిక ఎదుగుదల రాకుండా ఉండే పరిస్థితినే ఆటిజం అంటారని ప్రముఖ మానసిన వైద్య నిపుణురాలు డాక్టర్ ఎన్.కవితా ప్రసన్న తెలిపారు. ఇలాంటి పిల్లల పట్ల తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం అంతర్జాతీయ ఆటిజం అవేర్‌నెస్ డే సందర్భంగా డాక్టర్ 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆటిజంను వాడుక భాషలో మందబుద్ధి అని కూడా అంటారన్నారు. పిల్లల మెదడులోని కొంత భాగం సరిగా పనిచేయక పోవడం వల్ల మామూలు పిల్లాడిలా వ్యవహరించలేరని వివరించారు. ఈ వ్యాధి జన్యుపరమైన కారణాల వల్ల వస్తుందన్నారు. తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు తీవ్రమైన ఉద్వేగాలకు లోనవ్వడం, నెలలు నిండకుండా శిశువు పుట్టడం వల్ల, ఒక్కొక్కప్పుడు వంశపారం పర్యంగా మొదటి శిశువుకు ఈ సమస్య ఉన్నప్పుడు రెండవ సంతానానికి కూడా ఆటిజం సమస్య రావచ్చన్నారు. ఎవ్వరితో కలువకుండా ఒంటిరిగా ఉండడం, నేరుగా కళ్లలోకి చూడలేకపోవడం, మాట్లాడలేకపోవడం ఇతరులతో కలిసేందుకు ఇష్టపడకపోవడం, ప్రతిస్పందన లేకపోవడం, ఎలాంటి అనుభూతి కలిగి లేకపోవడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, ఎవరినీ పట్టించుకోకపోవడం ఆటిజం లక్షణాలుగా తెలిపారు. శిశువుకు ఒకటిన్నర సంవత్సరం నిండక ముందే ఆటిజం లక్షణాలు కనిపిస్తాయన్నారు. పిల్లల ఎదుగదల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిశువుకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆరోగ్యవంతంగా ఎదగడానికి వ్యాధి నిరోధక శక్తి పెరిగి మానసిక శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం అందించడం చాలా ముఖ్యమన్నారు. కండరాలు బలంగా ఉండేందుకు ఐరన్ ఉండే ఆహార పదార్థాలను ఇవ్వాలన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లు ఇస్తూండాలన్నారు. తల్లులు తమ పిల్లల్లో ఆటిజం నివారించడానికి గర్భధారణ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతోపాటు వత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. శారీరక శ్రమ కోసం ఇంటిపని, వంటపని, తోటపని వంటివి చేస్తూండాలన్నారు. ధూమపానం, ఆల్కహాల్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. శిశువు కదలికలను కూడా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. వీటితోపాటు తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. ముఖ్యంగా గర్భధారణ సమయంలో తల్లి, పుట్టాక పిల్లలు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఆధునిక కాలంలో సెల్‌ఫోన్ వల్ల చాలా సమస్యలు వస్తున్నా యన్నారు. ఉమ్మడి కుటుంబాల్లో ఆటిజం సమస్య తక్కువగా ఉంటుందన్నారు. పిల్లలు సాధారణంగా ప్రవర్తించకపోతే వెంటనే అప్రమత్తం కావాలని వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ కవితా ప్రసన్న సూచించారు. కొన్ని ప్రత్యేకమైన థెరపీల ద్వారా పిల్లల్లో సామాజిక నైపుణ్యాలను మెరుగు పరచాలన్నారు. వైద్యుల సలహాల మేరకు ఆటిజంకు చికిత్స తీసుకుంటూ అవసరమైన జాగ్రత్తలు పాటిస్తే ఈ సమస్య నుంచి పిల్లలను కాపాడుకోవచ్చని డాక్టర్ కవితా ప్రసన్న తెలిపారు.


డాక్టర్ ఎన్.కవితా ప్రసన్న

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎంపీ


ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి హారతి పడుతున్న మహిళలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రజా సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని భానుకోట సోమేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని అహోబిలం, రావుల కొలను గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కరించడానికి తాము రాజకీయాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందించి గొప్ప నాయకుడు అనిపించుకున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికలలో వైసిపికి ఘనవిజయం అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం వైసిపిదేనని తెలిపారు. జిల్లాలో ఎంపి, ఎమ్మెల్యే అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని అవినాష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల ఎన్నికల పరిశీలకుడు వీర శివారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, రావులకొలను సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ రఘు, పైడిపాలెం సర్పంచ్ ద్వారకనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటు వేయండి

లింగాల : వైసిపి పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని అంబకపల్లి గ్రామంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామంలోని ఆవుల స్వామి ఆలయం వద్ద పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మీదేవి, మాజీ ఎంపిపి సుబ్బారెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.


అభివృద్ధి సాధకుడికి మద్దతివ్వండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి సాధకుడనైన తనకు మద్దతిచ్చి మంచి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ శనివారం ప్రొద్దుటూరుకు చంద్రబాబు వచ్చిన సందర్భంగా ఆయనతోపాటు టిడిపి అభ్యర్థి వరదరాజులరెడ్డి తన గురించి చేసిన విమర్శల్లో ఏ ఒక్కటి నిజమని నిరూపించినా.. తనకు ఓటెయొద్దని, అబద్ధమని ప్రజలు నమ్మితే తనకు మద్దతివ్వాలని కోరారు. కుందూ-పెన్నా వరద కాలువ బాబు హయాంలో మంజూరైందన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఈ పనికి నిధులు మంజూరు చేయలేదని వరద చెప్పడం ఆయన చాందస్తానికి నిదర్శనమన్నారు. కుందూ-పెన్నా వరద కాలువ దివంగత నేత వైయస్ హయాంలో మంజూరు కాగా 12.5శాతం తక్కువతో వరద కుమారుడు కొండారెడ్డి టెండర్ దక్కించుకొని నిధుల్ని కొండారెడ్డి స్వాహా చేసి, ఆ పనిని అటకెక్కించారని ఆరోపించారు. ఈ పనులకు సిఎం రమేష్‌నాయుడు అడ్డుతగిలాడని ఆయనపై వరద కాలుదువ్విన వైనాన్ని సెల్‌లో ప్రదర్శించారు. ప్రజలు మోసగాళ్లని వరద చెప్పిన విషయాన్ని కూడా సెల్‌లో ప్రదర్శించారు. వరదరాజులరెడ్డికి మంచితనం, నైతిక విలువలు ఏమీ లేవని కేవలం ఎమ్మెల్యే పదవీ కాంక్ష ఉందన్నారు.

జగనన్నకు తోడుగా ఉందాం

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జమ్మలమడుగు ఎమ్మెల్యే సీటును గిఫ్ట్‌గా ఇచ్చి ఆయనకు తోడుగా ఉందామని జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం కన్నెలూరులోని 9వ వార్డులో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా, అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగిన పాలన మన జగనన్న హయాంలోనే సాధ్యమైందన్నారు. తనను, అవి నాష్‌రెడ్డికి రెండు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వేల్పుల శివమ్మ, క్యాంబెల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఆగస్టీన్ రాజు, కో-ఆప్షన్ సభ్యుడు గజ్జల లక్షుమయ్య, కౌన్సిలర్ పోచిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారంలో ఎమ్మెల్యే మూలే సుధీర్‌రెడ్డి

సురభిలో వైసిపి విస్తృత ప్రచారం

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం కోమటిపేట, గాజులపేటలో ఆదివారం వైసిపి మండల ఇన్‌ఛార్జి వైయస్ కొండారెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొండారెడ్డికి పూల మాలలతో ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి వెళ్లి జగన్ పాలనలో ప్రభుత్వ పథకాలు అందాయా లేదా, అందకపోతే ఏమి సమస్య అని అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల కంటే ప్రస్తుత ఎన్నికల్లో పులివెందుల ఎమ్మెల్యేగా జగన్మోహన్‌రెడ్డిని, కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమాజసేవ కోసం ఐక్యంగా కలిసి రావాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సమాజ సేవ చేసేందుకు ఐక్యంగా కలిసి రావాలని మానవతా సేవా సంస్థ మండలశాఖ అధ్యక్షుడు చల్లా బాలాజీ కోరారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మానవత సంస్థ మాసాంతర సమావేశం చైర్మన్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గండి చైర్మన్ కృష్ణతేజ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కవి వరప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం మానవతా సేవా సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి అడగకముందే మానవతా సేవా సంస్థకు చెందిన భవన నిర్మాణం చేపట్టేందుకు రిటైర్డ్ ఉపాధ్యాయుడైన కవి వరప్రసాద్ రూ.25 వేలు విరాళం ఇవ్వడం సంతోషకరమన్నారు. మానవతా సంస్థ ద్వారా సేవలు చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. వేంపల్లె శాఖ ఆదర్శంగా ఉండేలా సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, కో చైర్మన్ కృష్ణతేజ, ఉపాధ్యక్షుడు ముత్యాలయ్య, పోతిరెడ్డి శ్రావణ్‌కుమార్, సభ్యులు పుల్లగూర గోవర్ధన్, బొజ్జ అనిల్ కుమార్ రెడ్డి, చిన్న నర్సింహులు, శ్రీకళ, పోతిరెడ్డి గోపి, అరుణ్, డాక్టర్ రాజారాం, ప్రసన్న, ప్రదీప్, రాహుల్, వేముల చెంద్రాయుడు, తుమ్మల వెంకటేష్, వినయ్ పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : సమాజసేవే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవలు సాగిస్తున్నట్లు మానవతా జిల్లా కమిటీ అధ్యక్షులు రమణారెడ్డి తెలిపారు, ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో మానవత అధ్యక్షులు సుబ్బరాయుడు అధ్యక్షతన నెలవారీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రమణారెడ్డి మాట్లాడుతూ సమాజ సేవ కోసం మానవతా సేవలు మరింత విస్తృతం చేయాలని సూచించారు. నైతిక విలువలను విద్యార్థులకు బోధించాలని కోరారు. ఆత్మీయ సహకార కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం తల్లితండ్రులు లేని పదవ తరగతి విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని రమణారెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ కొండారెడ్డి, క్రిష్ణమూర్తి, శ్రీనివాసరెడ్డి, అంగడి నాగేంద్ర, విశ్వనాథరెడ్డి, దీనబంధు జనార్ధన్‌రెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


టిడిపిలో చేరిన వారితో బీటెక్ రవి

వట్టణంలోని ఇస్లాంపురం ప్రాంతానికి చెందిన మైనార్టీలు షేక్ బాబావలి, మహమ్మద్ రఫీ, మహబూబ్ బాషా, ఫాతిమా, 20 కుటుంబాలు ఆదివారం టిడిపి మున్సిపాలిటీ నాయకుల ఆధ్వర్యంలో వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ బీటెక్ రవి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో వలసల పర్వం మొదలైం దన్నారు. ఇప్పటికే చాలామంది వైసిపి నుండి తెలుగుదేశం పార్టీలో చేరార న్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాయడం తథ్యమన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసుకుంటూ దూసుకు పోతున్నారన్నారు. రవితేజరెడ్డి, మహబూబ్ బాషా, కాశీం, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : భూపేష్‌రెడ్డి


ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక టిడిపి కార్యాలయంలో కడప టిడిపి పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి ఆదివారం సాయంత్రం మండల నాయకులు, కార్యకర్తలతో సమాలోచనలు చేశారు. టిడిపి పార్లమెంట్ అభ్యర్థిగా మొదటిసారి ఎర్రగుంట్ల పార్టీ కార్యాలయానికి రావడంతో భూపేష్‌కు నాయకులు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలను, విధివిధానాలను శ్రేణులకు వివరించారు. జిల్లాలోని తమ బంధుమిత్రులందరిని కలిసి సైకిల్ గుర్తుకు ఓటు వేసేలా కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లా ప్రజలు ఒక్కసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి చూపిస్తానని తెలిపారు. జిల్లాకు పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానని భరోసానిచ్చారు. సమావేశంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వైఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చెన్నమరెడ్డి భాస్కర్‌రెడ్డి సేవలు మరువలేనని కడప ఎంపిడిఒ విజయ రాఘవరెడ్డి, మాజీ ప్రిన్సిపల్ సదాశివరెడ్డి, వెంకటనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సింహాద్రిపురంలోని వైఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మానసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి అన్నారు. విధి నిర్వహణలో ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ కళాశాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మి నారాయణమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 శారద, గురజాల పాఠశాల ఉపాధ్యాయుడు రామమోహన్ రెడ్డి, కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


సన్మాన కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి దంపతులు

ఇండియా కూటమి విజయం కోసం సహకరించాలి

- ఆమ్ అద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్

ప్రజాశక్తి - వేంపల్లె

సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయ కేతనం ఎగురవేసేందుకు ప్రజలు అందరూ సహకరించాలని ఆమ్ అద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ కోరారు. ఆదివారం స్థానిక ఆమ్ అద్మీ పార్టీ కార్యాలయంలో ప్లకార్డులు పట్టుకొని బిజెపికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజ్రీవాల్ బయట ఉంటే బిజెపికి ఓటమి తప్పదనే భయంతో మద్యం కేసులో ఇరికించారన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకొనేందుకు నియంత బిజెపికి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఆమ్ అద్మీ పార్టీని ఇబ్బంది పెట్టేందుకు సిబిఐ, ఈడి, సిఐడి వంటి కేంద్ర సంస్థలతో పలు కేసులు పెట్టించారన్నారు. రాబోవు ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆమ్ అద్మీ పార్టీ నాయకులు పీరుబాషా, షఫీ, అహమ్మద్, ఖదీర్, సిద్దిక్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నారాయణస్వామి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర వాల్మీకి సంఘ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అంబకపల్లి నారాయణస్వామి వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమితులయ్యారు. నియామక పత్రాన్ని ఆదివారం ఎంపీ అవినాష్‌రెడ్డి ఆయన నివాసంలో నారాయణస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ తన మీద అపార నమ్మకంతో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా తనను నియమించినందుకు సిఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధుసూధన్‌రెడ్డి, వైయస్ అభిషేక్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, బయపరెడ్డి, వేల్పుల రామలింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అఖండ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొన్నారు.

నానుబాలపల్లిలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపల్ పరిధిలోని నానుబాలపల్లి ఎస్సీ కాలనీలో 20 రోజులుగా తాగునీటి సమస్య ఉంది. బోరు చెడిపోయి మంచినీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకొనకపోవడం దారుణమని రైతు నేత, మైదుకూరు నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న ఎవి రమణ పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలో దెబ్బతిన్న నీటి బోరు, ట్యాంకును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయ పార్టీలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించకుండా కేవలం గ్రామాల్లో పార్టీ మార్పిడిలు, కండువా మార్పిడిలకే ప్రాధాన్య తనిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రయత్నించకపోతే రైతు సేవాసమితి ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకుని ఆందోళనలు ఉధృతం చేస్తామని రమణ తెలిపారు. రైతు నాయకులు పుష్పరాజు, ప్రజలు మోహన్, చెంచయ్య, ఓబయ్య, రమేష్, చంటి, మహిళలు లక్ష్మీదేవి, లలితమ్మ, సంటమ్మ పాల్గొన్నారు.

కూటమితోనే బిసిల అభివృద్ధి సాధ్యం : 'మండిపల్లి'

రాయచోటి : తెలుగుదేశం పార్టీ, జనసేన, ఎన్‌డిఎ కూటమితోనే బిసిల అభ్యున్నతి సాధ్యమవుతుందని, బిసిల ఆత్మగౌరవాన్ని ఎప్పటికీ తగ్గనివ్వమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం మాధవరంలో జయహో బిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంప్రసాద్ రెడ్డికి గ్రామ బిసిలు పూలదండలు కోలాటాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి బిసిల ప్రభుత్వం అని బిసిల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు మరింత మెరుగుపరిచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బిసిల రిజర్వేషన్ శాతాన్ని తగ్గించి వారి రాజకీయ ఎదుగుదలకు వైసిపి ప్రభుత్వం అడ్డు తగిందని ఆరోపించారు. గత తెలుగుదేశం పార్టీ బిసిలకు, వారి రాజకీయ ఎదుగుదలకు ప్రత్యేక భూమిక పోసించిదని, బిసిల ఆత్మగౌరవాన్ని ఎక్కడా తగ్గనివ్వమని, ఎప్పటికీ వారి వెంట నిలిచి అన్నివిధాలా వారి ఎదుగుదలకు కృషిచేస్తానన్నారు. మాధవరం గ్రామంలో వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న బిసి కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నాయని పార్టీ అధికారంలోకి రాగానే ఇక్కడి వారందరికీ వెలిగుల్లో ప్రాజెక్టు నుండి సాగునీరు, తాగునీరు అందిస్తామని చెప్పారు. టిడిపి అధికారంలోకి రాగానే మండల బిసిలకు సింహభాగాన్ని కేటాయిస్తామన్నారు.నాలుగు పర్యాయాలు గెలిచిన స్థానిక వైసిపి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి బిసిలకు ఏమిచేశారో చెప్పాలన్నారు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే ప్రత్యేక బిసి రక్షణ చట్టం అమలులోకి తీసుకవచ్చి వైసిపి బానిస సంకెళ్లు నుంచి బిసిలకు విముక్తి కలిగిస్తానని చెప్పారు. ఎవరితోనూ వ్యక్తిగత తనకు ఎటువంటి విభేదాలు లేవని అనునిత్యం కార్యకర్తలకు, అభిమానులకు అండగా ఉన్నానని చెప్పారు. పార్టీ గెలుపుకోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటానని తెలిపారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజులఖాదర్‌బాషా, మాజీ సర్పంచ్ నాగేశ్వర్ నాయుడు, రవీంద్రారెడ్డి, రఘుపతి నాయుడు, మాజీ సర్పంచ్, రెడ్డప్ప నాయుడు పాల్గొన్నారు.